# పొలం దొంగ

★ కె. ఆర్. మూర్తి ★

సంక్రాంతి నెల, ఆ యేడు మేత పుష్కలంగా ఉన్నది. లేగదూడలు బీట్లో పడ్తే వెతుక్కుంటేగాని కనబడవంటే నమ్మండి. ఇఖ నాపచేలల్లో, వేరుశనగచేలల్లో, జొన్న చూస్తేనే పండ్లు పులుస్తున్నది.

పోటీలుపడి ఒకరికి తెలీకుండా ఒకరు కోడెల్ని మేపుతున్నారు. సందకాడ అన్నం తిని పడుకుంటే ఎంత గోలైనా లేవని వెంకటసుబ్బడు కూడా సరిగ్గా ఒక కునుకుకూడా తీయటంలేదు. భజన్లు నేర్పటంతోనైతేనేం, పోపు ఎెద్దుల్ని మేపటంతోనై తేనేం రాత్రిళ్లు బలేసందడిగా ఉండేది.

నరసయ్యమామ నడివయస్సులో ఉన్నా కుర్రాళ్లుచేసే పన్నిటికి కుర్రాళ్ళల్లోకి కుర్రాడు, ఉత్తరపొలాన ఇంకా కొద్దిగా మేత ఉంటే గొడ్లను అక్కడనే కట్టేస్తున్నాడు. రేపో ఎల్లుండో తూర్పుపొలం తోల్దామని ఆచేనుఎట్లాఉందో చూద్దామని వెళ్ళితే కడుపులో మండిపోయింది. కర్రవదిలి కర్రఎవరో కోస్తున్నారు. చుట్టుపక్కల కూడా ఎద్దుల్ని మేపటంలో పేరు మోగినవాడాయె రోజూ ఈ విధంగా మేత పోతుంటే తనేం మేపేట్టు? అసలు తన చేలోనేనా ఇంతధైర్యం.

చేనిచుట్టూ తిరిగి తేరిపార చూశాడు. ఉత్తర పేపున కాడిగట్టున వెంకయ్య ఎద్దులు చేలో ఉన్నవి. పదిహేనురోజులు అయినట్లుంది. కాని చేనుమటుకు ఏమీ తగ్గినట్లులేదు. ఎద్దులుమటుకు ప్రత్తిబోరేల్లాగా తేలుతున్నయ్. నడుమువార్లు కూడా తీశేశాడు. బిర్రైనవి గామాలె. "ఓశ్ అట్టాగుటోయ్" అని తల ఊపాడు: ఉల్లిమళ్ళకు నీరు చల్లుకుంటుంటే వెంకయ్యదగ్గరకు వెళ్ళి వళ్లోనుంచి పొగాకుతీసి అతనికి ఒకకాడ ఇచ్చి తనొక చుట్ట చుట్టాడు. వెంకయ్య నిప్పుకొట్టి ఇచ్చాడు. ఏదో లోకాభిరామాయణం మాట్లాడుకుంటూ ఇద్దరూ ఇంటికి వచ్చారు.

మర్నాడు జాము ప్రొద్దుండగనే కొత్తచొక్కా తొడుక్కొని, పొన్నుకర్ర చేత్తోపట్టుకొని "ప్రొద్దుపోయినదాకా రానుగాని పిల్లల్ని అన్నానికి నాకోసం ఉంచవాక" అని ఇంట్లో చెప్పి బయలుదేరాడు. వెంకయ్య ఈయన్ని చూట్టంతోనే "ఎక్కడికయ్యోవ్ ప్రయాణం" అన్నాడు. ''రాజుపాలెంలో మనవాళ్లెందుకో, కబురు చేశారు. ఏమిటోసంగతి తెలీలేదు, కనుక్కుందామని పోతున్నాను.'' అనిచెప్పి "మా చేనుకూడా కాస్త చూస్తుండ''మన్నాడు. రాజుపాలెంబాటనే బయలుదేరి జొన్నచేను చాటుకాగానే చేనిచుట్టూ తిరిగి కండిపట్టెలో పోయి కూర్చున్నాడు.

ప్రొద్దుకూకనే కూకింది. నర్సయ్యమామ చూస్తుండగానే ఆయనచేలో వెంకయ్య మేత కోయనే కోస్తున్నాడు. మానవుడు అట్లాగే కూర్చున్నాడు కాసేపటిదాకా, తరువాత మెల్లగా లేచాడు. వెనగ్గా వెళ్ళి వంగోని మేత కోస్తున్న వెంకయ్యవీపుమీద బలంకొద్దీ కర్రతో ఒక్కటి పెట్టాడు.

"చస్తినయ్యోవ్" అనికేకేశాడు, వెంకయ్య. "నువ్వా. మామా! ఎంతపని జరిగిందీ!" అని ఎదురుగా వెళ్లాడు ఓదార్చటానికి, నర్సయ్య మామ.

ఏం లాభం, వెంకయ్యనడుములు అప్పటికీ, ఇప్పటికీ వంకరగానే ఉన్నయ్.

అయితే అప్పటికీ, ఇప్పటికీ ఆ ఊళ్లో అట్లాంటి దొంగతనాలు జరగలేదంటారు.